సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం ၊ 3 ၊ ఫిబ్రవరి ၊ 2025



పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

సబ్ డివిజన్‌లో ఉన్న పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ అశోక్‌కు మార్ తెలిపారు. ఆదివారం ప్రొద్దుటూరు డీఎస్పీ కార్యాలయానికి విచ్చేశారు. -8లో



మేధావుల మౌనం దేశానికి నష్టం

మేధావుల మౌనం దేశ, రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం అని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.5/22.0

జిల్లాలో ఆదివారం 22.0 - 33.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

విచారణ కమిటీ నియామకం

కడప వైఎస్ఆర్ సర్కిల్: డీటీసీ లైంగిక వేధింపులపై కలెక్టర్ విచారణ కమిటీని నియమించారు. ఈ విచారణ కమిటీ సభ్యులుగా జెడ్పీ సీఈవో ఓబుళమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీ, అడ్వకేట్ జి. ఉమాదేవి, ఆర్తి హోం ఫౌండేషన్ చైర్మెన్ పీవీ సంధ్య, జిల్లా పంచాయతీ అధికారి జి. రాజ్యలక్ష్మీ ఉన్నారు. ఈ నెల 5న కలెక్టరేట్‌లోని డి–బ్లాక్‌లో విచారణ జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కేంద్రంతోపాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా ఉంటుందని పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా అందజేయవచ్చని తెలిపారు.

డయల్ యువర్ కలెక్టర్

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రజలు 08562 -244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో తెలియజేశారు.

5న జాబ్ మేళా

కడప ఎడ్యుకేషన్: కడప కాగితాలపెంటలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐలో 5వ తేదీ ఉదయం 10 గంటలకు ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నరాజు తెలిపారు. ఈ జాబ్ మేళాకు శ్రీకాళహస్తికు చెందిన ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ లిమిటెడ్, కడపకు చెందిన షిర్డిసాయి ఎలక్ట్రికల్స్, రేణిగుంట అమర్‌రాజాతోపాటు కడపలోని మరిన్ని కంపెనీలు హాజరవుతాయని పేర్కొన్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మేళాలో ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు నెలకు జీతం రూ. 13 వేల నుంచి రూ. 18 వేల వరకు ఉంటుందని వెల్లడించారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ విద్యార్హత మార్కుల జాబితాలు, రెండు ఫొటోలు, ఆధార్‌కార్డు, బయోడేటా, జిరాక్స్ కాపీలతో నేరుగా జాబ్‌మేళాకు హాజరు కావాలని ఏడీ రత్నరాజు తెలిపారు.

గంగమ్మా..కాపాడమ్మా



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అనంతపురం గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిలాడింది. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. తలనీలాలు అర్పించారు. ఆలయ పూజారులు చెల్లు వంశీయులు గంగరాజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గంగమ్మా..అందరూ చల్లగా ఉండేలా కరుణించి కాపాడు తల్లీ అని వేడుకున్నారు.పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యూ ఆర్ కోడ్‌తో సులభంగా బిల్లుల చెల్లింపు



క్యూఆర్ కోడ్ ద్వారా బిల్లు చెల్లింపును వివరిస్తున్న ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్: విద్యుత్ బిల్లులను క్యూఆర్ కోడ్ ద్వారా సులభంగా చెల్లించవచ్చని ఏపీ ఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీరు ఎస్.రమణ తెలిపారు. ఆదివారం స్థానిక నెహ్రూనగర్‌లో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యుత్ బిల్లులు క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించే విధానంపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యుత్ బిల్లుకు డిమాండ్ నోటీస్ కింది భాగంలో క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. దీనిని గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి యూపీఐల ద్వారా స్కాన్ చేసి విద్యుత్ బిల్లులను సులభంగా చెల్లించవచ్చని తెలిపారు. బిల్లులను చెల్లించేందుకు క్యూలైన్లో నిల్చోకుండా, అనధికార వ్యక్తులకు డబ్బులు ఇచ్చి మోసపోకుండా ఈ విధానం చాలా ఉపయోగపడుతుందన్నారు. క్యూఆర్ కోడ్ ప్రతినెలా మారుతూ ఉంటుందని, ఒకసారి డిమాండ్ నోటీస్ ఇచ్చిన తర్వాత మరోసారి ఇవ్వడం సాధ్యం కాదన్నారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులను భద్రపరచుకొని ఏ నెలలో వచ్చిన బిల్లును ఆ నెలలోనే చెల్లించాలని కోరారు. ఏఈ శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమిగా పేకాట

- జిల్లాలో అనధికార పేకాట క్లబ్‌లు ఏర్పాటు
- అక్రమ ఆదాయం కోసం కూటమి నేతల అడ్డదారులు
- ఎస్పీ, కలెక్టర్‌కు ఫిర్యాదు ప్రతులను పంపిన ఎంపీ సీఎం రమేష్
- అనకాపల్లి ఎంపీ గుర్తించినా కళ్లు తెరవని జిల్లా యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, కడప: జిల్లాలో పేకాట క్లబ్బుల గబ్బు జోరుగా సాగుతోంది. పులివెందుల మొదలు జమ్మలమడుగు.. ప్రొద్దుటూరు ఇలా నలు దిక్కులా విస్తరిస్తోంది. అక్రమ ఆదాయమే లక్ష్యంగా కూటమి నేతలు బరితెగిస్తున్నారు. మూడు భూ ఆక్రమణలు.. ఆరు పేకాట క్లబ్బులతో చెలరేగిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా అనధికార క్లబ్‌లు యథేచ్ఛగా సాగుతున్నా.. వీటి దెబ్బకు కుటుంబాలు గుల్లవుతున్నా... జిల్లా యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. నిఘా వర్గాలు నివేదించినా కిమ్మనడం లేదు. సామాజిక మాధ్యమాలల్లో ట్రోల్ చేశారని వందలాది మందికి నోటీసులు జారీ చేసిన పోలీసు యంత్రాంగానికి అనధికార పేకాట క్లబ్‌లు కనబడలేదా అని నలువైపుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అధికారిక పగ్గాలు చేపట్టగానే కూటమి నేతలు విచ్చలవిడి దందాలు, దౌర్జన్యాలకు బరి తెగించారు. ప్రకృతి సంపద ఇసుక, గ్రావెల్ అక్రమంగా తరలిస్తూ దోపిడీ రాయుళ్ల అవతారమెత్తారు. మరోవైపు ప్రభుత్వ భూములతో పాటు సుప్రీంకోర్టు ఉత్తర్వులను సైతం ఉల్లంఘిస్తూ చెరువు, వంక పోరంబోకు భూములను సైతం ఆక్రమిస్తున్నారు. ఇలాంటి చర్యలకు జిల్లాలో రెవెన్యూ, పోలీసుశాఖల అండదండలు ఉండడంతో మరింతగా రెచ్చిపోతున్నారు. కట్టడి చేయాల్సిన కలెక్టర్ శ్రీధర్ అటు దిశగా సమీక్ష కూడా చేపట్టలేదనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు పోలీసు వ్యవస్థను చెప్పు చేతల్లో పెట్టుకొని విచ్చలవిడి దౌర్జన్యాలకు దిగుతూ, అక్రమ ఆదాయం కోసం అడ్డదారులు ఎంచుకున్నారు. ఈక్రమంలో నిజాయితీ పరుడిగా ముద్రపడ్డ ఎస్పీ హర్షవర్ధన్‌రాజును అర్ధాంతర బదిలీ



జిల్లా కలెక్టర్‌కు సీఎం రమేష్ రాసిన లేఖ

బహుమానంగా ఇచ్చారు. తాజాగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌కు కింది స్థాయి సిబ్బంది ఆశించిన మేరకు సమాచారం ఇవ్వడం లేదనే ఆరోపణలు లేకపోలేదు.

పులివెందులలో మొదలు...

అనధికార పేకాట క్లబ్‌లు నిర్వహణ తొలుత పులివెందుల సబ్ డివిజన్‌లో మొదలైంది. ట్రిబుల్ స్టార్ అధికారుల ప్రోత్సాహం, అధికార పార్టీ నేతల అండదండలతో తెలుగుతమ్ముళ్లు యథేచ్ఛగా కొనసాగించారు.



ఇటీవల ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవీంద్రనాథరెడ్డిల మధ్య నెలకొన్న విభేదాలు కారణంగా తాత్కాలికంగా తెరపడినట్లు తెలుస్తోంది. ఈజాడ్యం జమ్మలమడుగు సబ్ డివిజన్, అటునుంచి ప్రొద్దుటూరు సబ్ డివిజన్ దాకా విస్తరించింది. నియోజకవర్గ కేంద్రమైన జమ్మలమడుగులో పేకాట క్లబ్ యథేచ్ఛగా దేవగుడికి చెందిన నాగేశ్వరరెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు స్వయంగా ఎంపీ సీఎం రమేష్‌నాయుడు కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. అనకాపల్లె ఎంపీ గుర్తించేంతవరకూ జిల్లా యంత్రాంగానికి తెలియదనుకోవాలా? తెలిసినా కూటమి ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండడంతోనే మిన్నకుండిపోయారా? ఇలాంటి ప్రశ్నలకు జిల్లా అధికార యంత్రాంగం వద్ద జవాబు కొరవడింది. పైగా ఎంపీ రమేష్‌నాయుడు ఫిర్యాదు వ్యవహారం బహిర్గతం కావడంతో 'తేలుకుట్టిన దొంగలా' జిల్లా యంత్రాంగం వ్యవహరిస్తుండడం విశేషం.



నీరుగారుతున్న వ్యవస్థ...

కూటమి ప్రభుత్వంలో వ్యవస్థలు సర్వనాశనం అవుతున్నాయనేదానికి చాలా ఉదాహరణలు చెప్పుకొవచ్చు. వేముల మండలంలో టిఫిన్ కంపెనీకి చెందిన కోట్లాది రూపాయాలు విలువైన 2వేల పైబడి టన్నుల బెరైటీస్ రాత్రికి రాత్రి లూటీ చేశారు. సంక్రాంతి పండుగ రోజు భారీ టిప్పర్లతో తెల్లారేలోపు తరలించుకుపోయారు.దీనిపై టిఫెన్ కంపెనీ కేర్ టేకర్ రామలింగారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బెరైటీస్ ఖనిజం ఫలానా చోటికి తరలించారని స్పష్టంగా వివరించినా, అందుకు బాధ్యులు పేర్ల పార్థసారధిరెడ్డి, పేర్ల శేషారెడ్డి, మబ్బుచింతలపల్లె శ్రీనాథరెడ్డిలంటూ ఫిర్యాదు చేసినా కనీసం ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. ఇప్పటికీ ఫిర్యాదుదారుడికి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అధికార పార్టీ నేతల సిఫార్సులు లేకపోతే, కనీసం ఎఫ్ఐఆర్ కూడా నోచుకోవడం లేదంటే పోలీస్ వ్యవస్థ ఎలా ఉందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. ఇక అనధికార పేకాట క్లబ్‌లు కట్టడి చేయడానికే దమ్ము, ధైర్యం లేని దుస్థితిలో జిల్లా పోలీసుశాఖ ఉంటోందని పలువురు వాపోతున్నారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి ఎలా ఉన్నా, కూటమి ప్రభుత్వంలో విచ్చలవిడి పేకాట నిర్వహణ సాధ్యమైందని విశ్లేషకులు దెప్పి పొడుస్తుండడం గమనార్హం.

ప్రయోగంలో మాయాజాలం

- ఈ నెల 5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు
- పరీక్షా కేంద్రాలలో కానరాని మౌలిక వసతులు
- అధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు
- 30కి 30 మార్కులు లక్ష్యంగా బేరసారాలకు అడుగులు



ప్రాక్టికల్ చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

కడప ఎడ్యుకేషన్: 'ప్రాక్టికల్స్'.. సంవత్సరం మొత్తం ఈ పేరు వినడం తప్పా విద్యార్థులు ఏనాడూ ల్యాబ్ గడప తొక్కరు. ప్రయోగాలంటే అసలు పరిచయమే ఉండదు. పరికరాలంటే కొంతైనా జ్ఞానముండదు. అయినా.. ప్రాక్టికల్ పరీక్షల్లో మాత్రం మార్కులు రావాలి... కావాలి. అవును.. ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఇప్పుడా పనిలోనే ఉన్నాయి. అధికారులను ప్రసన్నం చేసుకుని తమ పనిని చక్క పెట్టుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. అలా ఇలా కాదు తమ విద్యార్థులకు 30కి 30 మార్కులు వేయించుకునేదాకా 'సకల'కళలను ప్రదర్శిస్తున్నాయి. అంతా పైసామే పరమాత్మ.

వారి దృష్టంతా థియరీపైనే...

ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఏడాదిపొడవునా థియరీ, పోటీ పరీక్షలపైనే దృష్టి సారిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. నిజానికి విద్యార్థులు పాఠ్యాంశాలను వందశాతం అర్థం చేసుకోవాలంటే ప్రయోగాలు తప్పనిసరి. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రయోగ పరీక్షలు చేయించాలి. కానీ సదరు యాజమన్యాలు వాటిని విస్మరిస్తున్నాయి. ఏనాడు విద్యార్థులను ల్యాబులకు తీసుకెళ్లి ప్రాక్టికల్ చేపించరు. ఇదేమని ప్రశ్నించే అధికారులు కూడా కనిపించరు. దీనికితోడు చాలా కళాశాలల్లో ల్యాబ్‌లు సరిగా ఉండవు. ఒక వేళ ల్యాబులున్నా అందులో పరికరాలు, కెమికల్స్‌తో పాటు మౌలిక వసతులు కానరావు. ఇక కళాశాలలకు తనిఖీలకు వెళ్లే అధికారులు ప్రాక్టికల్స్ గురించి ప్రశ్నించరనే ఆరోపణలు ఉన్నాయి.

ఈ నెల 5వ తేదీ నుంచి...

జిల్లావ్యాప్తంగా ఈ నెల 5వ తేదీ నుంచి ఇంటర్ ఒకేషన్ ప్రాక్టికల్ పరీక్షలు, 10వ తేదీ నుంచి జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇప్పుడిప్పుడే ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు తమ కళాశాలల్లో ఉన్న ల్యాబ్‌లకు బూజులు దులుపుతున్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు పరికరాలతోపాటు కెమికల్స్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. అన్ని సిద్ధం చేసినా వాటినెలా చేయాలో మాత్రం పిల్లలకు తర్ఫీదు ఇవ్వలేదనే ఆరోపణలు మాత్రం మెండుగా ఉన్నాయి. ఏదిఏమైనా ఈ ప్రాక్టికల్ పరీక్షల్లో చాలా మంది పిల్లలకు 30కి 30 మార్కులు వస్తాయి. అదంతా ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాల మాయనే చెప్పాలి.

16 వేలకుపైగా విద్యార్థులు...

జిల్లావ్యాప్తంగా ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఒకేషనల్‌తోపాటు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ప్రాక్టికల్ పరీక్షలకు 16 వేలకు పైగా మంది విద్యార్థుల హాజరుకానున్నారు. జిల్లాలో 20 ప్రభుత్వ, 83 ప్రైవేటు, 17 కేజీబీవీలు, 10 హైస్కూల్ ప్లస్, 3 మోడల్, 5 ప్రైవేటు ఎయిడెడ్, 11 సాంఘీక సంక్షేమ కళాశాలలు ఉన్నాయి.

కట్టుదిట్టంగా నిర్వహిస్తాం



ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ప్రాక్టికల్ ప్రయోగ పరీక్షలకు అంతా సిద్ధం చేశాం. ఇందులో 5 నుంచి ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభంకాగా 10 నుంచి జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమౌతాయి. కట్టుదిట్టంగా నిర్వహిస్తాం.

–వెంకటసుబ్బయ్య,ఆర్ఐవో,ఇంటర్ విద్య



గరుడునిపై ఘనశ్యాముడు

ఆ క్షేత్రం మాడవీధులన్నీ భక్తిభావంతో భజనలు చేస్తున్న భక్తులతో నిండిపోయాయి. ఒకవైపు మంగళ వాయిద్యాల హోరు...మరోవైపు కళాకారుల కోలాటాలు...ప్రతిధ్వనించిన గోవిందనామ స్మరణలు....దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల శోభ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం స్వామి ముత్యపు పందిరివాహనంలో మాడవీధుల్లో విహరించారు. శ్వేతపందిరి నీడన రాజగోపాలుడిగా గంభీరంగా ఆశీనులైన స్వామి వారిని భక్తులు దర్శించుకుని పూజాద్రవ్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం తన దర్శనం కోసం ఎదురుచూస్తున్న భక్తులను కరుణించేందుకు ఘనశ్యాముడు విష్ణుమూర్తి గరుడునిపై కొలువుదీరాడు. సకల ఆయుధాలను ధరించి ఇలకు దిగి ముల్లోకాలను కటాక్షిస్తూ ఆ మాడవీధుల్లో సాగాడు. విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్న ఆ దివ్య తేజోరూపుడిని దర్శించుకున్న భక్తులు తన్మయులై అడుగడుగునా గోవిందనామ స్మరణలతో తరించారు.

నేడు కల్యాణోత్సవం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు. –కడప కల్చరల్

తలనీలాల కోసం 4న వేలంపాట

సిద్ధవటం: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా నిత్యపూజ స్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాల పోగు హక్కు కోసం ఈనెల 4న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నారు. సిద్దవటంలోని రంగనాయక స్వామి ఆలయంలో మంగళవారం ఉద యం 11 గంటలకు వేలంపాట జరుగుతుందని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యపూజ స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు జరుగుతాయన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ధరావత్తు కింద లక్ష రూపాయలు చెల్లించాలన్నారు. మిగిలిన షరతులను వేలం పాట సమయంలో తెలియజేస్తామన్నారు.



నిత్యపూజయ్యస్వామి

ఫీజు పోరును జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో పార్టీ నేతలు అంజద్‌బాషా, సురేష్ బాబు, ఎంవీ రామచంద్రారెడ్డి తదితరులు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర నాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు ఈనెల 5వ తేదీ నిర్వహించే ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జిలు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అనేక సంస్కరణలు అమలు చేశారన్నారు. ఫలితంగా లక్షలాది మందికి మేలు జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసిందని, మూడు త్రైమాసికాలుగా 3900 కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయకుండా ఉందన్నారు. దీనివల్ల కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందికి గురిచేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేసే వరకు వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదన్నారు. మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గతంలో ఉన్న ఫీజు బకాయిలన్నీ చెల్లించి విద్యార్థులు ఎంత పెద్ద కళాశాలలో చదివిన పూర్తి ఫీజు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో చంద్రబాబు ప్రభుత్వం ఆటలాడుతోందని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు పులి సునీల్ కుమార్, కరీముల్లా యానాదయ్య , జయచంద్రారెడ్డి , యువజన విభాగం అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య విద్యార్థి విభాగం అధ్యక్షుడు పి సాయి దత్త పాల్గొన్నారు.

ఎస్పీకి వినతి

వైఎస్సార్ సీపీ చేపట్టిన ఫీజు పోరు కార్యక్రమానికి అనుమతులు మంజూరు చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష, నగర మేయర్ సురేష్‌బాబు, ఇతర నేతలు కోరారు. ఈ మేరకు వారు ఎస్పీని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

కడపరాయుడితో బంధం పదిలం!

- శ్రీ మహావిష్ణు పేరిట పూజా ద్రవ్యాల వ్యాపారం
- ఏటా వచ్చే ఆదాయంలో పది శాతం కడప రాయునికి కప్పం
- తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆధ్యాత్మికత
- ఆదర్శ జీవనాన్ని సాగిస్తున్న చాన్‌బాషా

కడప సెవెన్‌రోడ్స్: ఆయన్ను కదిలిస్తే కడప రాయుని గురించిన విశేషాలను పూసగుచ్చుతారు. భారతీయ పురాతన అద్వైత వేదాంతానికి సంబంధించిన యోగ వాశిష్ఠం గురించి అలవోకగా వివరిస్తారు. ఆయన చేసేది స్వామి సేవకు వినియోగించే కస్తూరీ సుగంధాది పరిమళ పూజా ద్రవ్యాల వ్యాపారమే. శ్రీ మహావిష్ణు మార్కెటింగ్ పేరిట నిర్వహించే దుకాణం ద్వారా ఏటా వచ్చే ఆదాయంలో పది శాతం కప్పురపు రాయునికి కప్పం పేరిట భక్తి పూర్వకంగా సమర్పించుకుంటారు. చివరికి ఆయన కాలర్ ట్యూన్ కూడా 'పొడగంటిమయ్యా మిమ్ము'అని అంటుంది. ఆయనే కడపకు చెందిన కొప్పుగంటి చాన్‌బాషా.

- ఖాజీపేట మండలం చెమ్ముళ్లపల్లె చాన్‌బాష స్వగ్రామం. ఆయన తండ్రి చిన్న ఖాసింసాహెబ్ 1960వ దశకంలో కడప పట్టణానికి వచ్చి స్థిరపడ్డారు. 1989లో చాన్‌బాషా కడప పీజీ సెంటర్ నుంచి ఎంకాం పట్టా అందుకున్నారు. కొంతకాలం ఎల్ఐసీలో పనిచేసిన ఆయన.. పలు



చాన్‌బాషా నడుపుతున్న పూజా ద్రవ్యాల షాపు

కారణాలతో అది మానేసి సైకిల్‌పై వీధివీధి తిరుగుతూ అగరొత్తీలు విక్రయించి జీవనం సాగించేవారు. ఆయన కుమారుడు ఆడిటర్‌గా, కుమార్తె జూనియర్ అడ్వకేట్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన కడపలో శ్రీ మహావిష్ణువు మార్కెటింగ్ పేరుతో అగరబత్తీ షాపును నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు వీధి వీధిన తిరిగే వ్యాపారం చేసుకుని పొట్టపోసుకున్న తాను ఈ స్థాయికి వచ్చానంటే అందుకు కడప రాయుని అనుగ్రహమే కారణమంటారాయన. నిత్యం స్వామి సేవకు వినియోగించే పచ్చ కర్పూరం, పచ్చ కర్పూరం నూనె, లావెండర్ నూనె, మల్లెపూల నూనె, కస్తూరి ధూపాలు, ఒరిజినల్స్ శాండిల్ ధూపాలు, కస్తూరి, జవ్వాది, శాండిల్ తదితర 40 రకాల క్రీములు ఆయన విక్రయిస్తుంటారు.

- తల్లిదండ్రులైన హుసేనమ్మ, చిన్న ఖాసిం సాహెబ్‌ల నుంచి వారసత్వంగా ఆయనకు ఆధ్యాత్మికత అలవడింది. ఆయన తల్లిదండ్రులు తిరుమలలో స్వామికి పెద్ద కల్యాణం జరిపించేవారు. తరుచూ స్వామిని దర్శించేవారు. తల్లి హుసేనమ్మ కైలాస మానస సరోవర యాత్ర కూడా చేయడం విశేషం. దీంతో చాన్‌బాషాకు శ్రీనివాసుడంటే వల్లమాలిన భక్తి ఏర్పడింది. నిరంతరం స్వామికి సంబంధించిన పుస్తక పఠనం, అన్నమాచార్య కీర్తనలు ఆలకిస్తుంటారు. ఓ సారి తిరుమలలో సంపూర్ణ బ్రేక్ దర్శన భాగ్యం కలిగిందని గొప్పగా చెబుతుంటారు. సుమారు అరగంట పాటు స్వామి వారి సన్నిధిలో గడపడం తన జీవితంలో మరిచిపోలేని అనుభవమంటారు. శ్రీమహా విష్ణువు పేరిట వ్యాపారం నిర్వహిస్తున్నందువల్ల ఏటా ఆదాయంలో 10 శాతం కప్పంగా కడప రాయునికి చెల్లిస్తుంటానని తెలిపారు. అగరబత్తీలు, కస్తూరి, జవ్వాది తదితర పూజా సామాగ్రి రూపంలో స్వామి వారికి సమర్పిస్తుంటామని చెబుతారు. దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు తరుచుగా ఒంటిమిట్ట శ్రీ కోదండ రాముడిని కూడా దర్శించుకుంటానని చెప్పారు.

క్లుప్తంగా

కారు, ద్విచక్రవాహనం ఢీ

లింగాల : లింగాల మండలం చిన్నకుడాల గ్రామ సమీపంలో కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లె గ్రామానికి చెందిన మదన్‌మోహన్, పెద్దక్కలు కారులో అనంతపురం జిల్లా నార్పలలో గృహ ప్రవేశ కార్యక్రమానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా, చిన్నకుడాల గ్రామ సమీపంలో పఠాన్ కమాల్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో పులివెందుల నుంచి పెద్దకుడాల గ్రామానికి వస్తుండగా కారు, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అదే విధంగా కారులో ఉన్న మదన్‌మోహన్, పెద్దక్క, ద్విచక్రవాహనంలో ఉన్న పఠాన్ కమాల్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే 108 వాహనంలో పులివెందుల ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పెద్దక్క పరిస్థితి ఆందోళనకరంగా ఉందని బంధువులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


మృతి చెందిన పద్మావతి

వేముల : మండలంలోని కె.కె.కొట్టాల గ్రామానికి చెందిన సింగంశెట్టి పద్మావతి(50) అనే మహిళ ఆదివారం మబ్బుచింతలపల్లె గ్రామానికి వెళ్లే పొలంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కె.కె.కొట్టాల గ్రామంలో పద్మావతి భర్త సుబ్బరాయుడుతో కలిసి ఉంటోంది. ఈ కుటుంబం పాడి పశువులను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరిగా ఆదివారం పద్మావతి పశువులను మేతకు సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లింది.ఆ సమయంలో ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవి కమ్మల కోసం హత్య చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మబ్బుచింతలపల్లె గ్రామానికి వెళ్లే పొలాల్లో మహిళ మృతదేహం ఉందని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ ఉలసలయ్య, ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్‌లు సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. మృతిపై పలు అనుమానాలు ఉండటంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురి అరెస్టు

మైదుకూరు : వనిపెంట అటవీ క్షేత్ర పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఆదివారం కూంబింగ్ నిర్వహించి ఎర్రచందనం చెట్లను నరుకుతున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి 3 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు వనిపెంట అటవీ రేంజ్ అధికారి ప్రణీత రావు తెలిపారు. నల్లమల అడవిలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించినట్లు సమాచారం అందడంతో డీఎఫ్‌ఓ వినీత్ కుమార్, సబ్ డీఎఫ్‌ఓ ఎస్‌వీ దివాకర్ ఆదేశాలతో నీలాపురం బీట్‌లో కూంబింగ్ నిర్వహించినట్లు ఎఫ్‌ఆర్‌ఓ తెలిపారు. ఎర్రచందనం చెట్లను నరికి, దుంగలుగా మార్చి రవాణాకు సిద్ధం చేస్తున్న నీలాపురం గ్రామానికి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కూంబింగ్‌లో డీఆర్‌ఓ అన్వర్ హుస్సేన్, అటవీ సిబ్బంది సుచిత, ఈశ్వరమ్మ, సురేంద్ర పాల్గొన్నట్లు వివరించారు.

దొంగలు బాబోయ్.. దొంగలు!

- వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న ఖాజీపేట ప్రజలు
- పోలీసులకే సవాల్ విసురుతున్న దొంగలు
- నామమాత్రంగా కేసుల దర్యాప్తు

ఖాజీపేట : ఖాజీపేట మండలంలో దొంగలు చెలరేగిపోతున్నారు. వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గృహాలు, దేవాలయాలు, దుకాణాలు ఇలా ఒకటేమిటి ఏది దొరికితే అది అందిన కాడికి దోచుకుని పరారవుతున్నారు.. వీరికి తోడు మరో బ్యాచ్ మొబైల్స్ చోరీలు.. వ్యవసాయ రైతు మోటార్ల వైర్ల చోరీలతో హడలెత్తిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

ఖాజీపేట మండలంలో దొంగలు ప్రధానంగా ఆలయాలపై దృష్టి సారించారు. ఆలయాల్లో సీసీ కెమెరాలు లేకపోవడం, ఒక వేళ ఉన్నా వాటి ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టకపోవడంతో ఆలయాలనే లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు ప్పాలడుతున్నారు. అందులోని కానుకలను అపహరిస్తున్నారు. భూమాయపల్లె గ్రామం జాతీయ రహదారికి దగ్గరగా ఉన్న ఒక్క ఆలయంలోనే 9 సార్లు హుండీని పగులగొట్టి చోరీ చేసి దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఇక్కడి ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నా పోలీసులు స్పందించడం లేదు. అలాగే దుంపలగట్టు ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నా అక్కడ ఇప్పటి వరకూ మూడుసార్లు చోరీ జరిగింది. ఇంత వరకూ ఎలాంటి రికవరీ లేదు. వీటికితోడు ఆంజనేయ కొట్టాలు ఆలయం, ఖాజీపేట బైపాస్ దగ్గర ఉన్న సాయిబాబా ఆలయం వద్ద ఇలా వరుస చోరీలు జరుగుతూనే ఉన్నాయి.

కేసుల నమోదు అంతంత మాత్రమే..

మండలంలో చాలా చోట్ల చోరీలు జరుగుతున్నా పోలీసుల చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి. ఖాజీపేట టౌన్‌లో ఏక కాలంలో 8 చోట్ల చోరీలు జరిగినా పెద్దగా నగదు పోలేదనే కారణంతో పోలీసులు కనీసం కేసు నమోదు చేయక పోవడం గమనార్హం. చిన్న చోరీలైనా ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుని ఉంటే నేడు ఇన్ని చోరీలు జరిగి ఉండేవి కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.


సన్నపల్లెలోని ఇంటిలో దొంగలు బీరువా పగుల కొట్టి చోరీ చేసిన దృశ్యం(ఫైల్)

ఇటీవల ఖాజీపేట మండలంలో జరిగిన చోరీల వివరాలు..

- ఆంజనేయకొట్టాలు గ్రామంలోని గంగమ్మ గుడిలో రెండు సార్లు హుండీని చోరీచేసి కానుకలు అపహరించారు.
- ఆంజనేయకొట్టాలు సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో హుండీ పగుల కొట్టి కానుకలను అపహరించారు.
- ఒక వృద్ధుడిని బైక్‌లో తీసుకెళ్లి అతని వద్ద నుంచి బంగారు వస్తువులు చోరీకి ప్రయత్నించారు. అదృష్టం కొద్ది స్థానికులు రావడంతో అతన్ని వదిలి వెళ్లిపోయారు.
- దుంపలగట్టు గ్రామంలోని రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి ఇంటిలో 14.9 తులాల బంగారం, రూ 4.20 లక్షల చోరీ చేశారు. సుమారు రూ.16.20 లక్షలు చోరీ జరిగింది.
- భూమాయపల్లె ఆలయంలో వరుసగా 9 సార్లు చోరీ జరగడం గమనార్హం.
- సాయిబాబా ఆలయంలో హుండీలోని కానుకలను చోరీ చేశారు.
- అగ్రహారంలోని రెండు ఇళ్లలో పెట్టెలో దాచుకున్న డబ్బు, దుస్తులు అపహరించారు.
- ఖాజీపేట బస్టాండ్ కూడలిలో మొబైల్స్ చోరీలు జరుగుతున్నాయి. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుల చిత్రాలను అందించినా ఎలాంటి ఫలితం లేదు.
- దుంపలగట్టు అంకాళమ్మ ఆలయంలో పలు మార్లు చోరీ జరిగింది.
- సన్నపల్లె గ్రామంలో తుమ్మలూరు రవీంద్రారెడ్డి ఇంటిలో 13 తులాల బంగారం, రూ.1.50 లక్షల నగదు, రూ.5వేలు విలువగల వెండి ఆభరణాలు కలిపి సుమారు రూ.12 లక్షల విలువ గల చోరీ జరిగింది.
- పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఏటీఎం చోరీకి విఫలయత్నం జరిగింది.


ఎస్‌బీఐ ఏటీఎం చోరీని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

పనిచేయని సీసీ కెమెరాలు..

ఖాజీపేట బస్టాండ్ కూడలిలో గతంలో పలుమార్లు స్థానికుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి పనిచేయకుండా పోయాయి. దీంతో బస్టాండ్ కూడలిలో ఏ చిన్న సంఘటన జరిగినా ఎవరి ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఉన్నాయి.. అందులో ఏం రికార్డు అయిందనే విషయాలపై పోలీసులు ఆధారపడాల్సి వస్తోంది.

కనిపించని పోలీస్ చర్యలు

ఖాజీపేట మండలంలో వరుస చోరీలు జరుగుతున్నా కనీసం పోలీసుల గట్టి చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. మోటార్ల వైర్ల దొంగలను రైతులు పట్టించి ఇస్తే విచారణ జరిపి కేసు నమోదు చేసి రికవరీ చేయడం తప్ప దర్యాప్తు చర్యలు శూన్యంగా కనిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో చోరీల నియంత్రణకు ఏర్పాటు చేసిన గస్తీ కూడా నామమాత్రంగానే సాగుతోంది. దీంతో దొంగలు చోరీలను కొనసాగిస్తూ పోలీసులకే సవాల్ విసురుతున్నారు.

ప్రత్యేక బృందంతో పర్యవేక్షణ చేస్తున్నాం

వరుస చోరీలపై ప్రత్యేక దృష్టి సారించాం. అందుకోసమే ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశాం. చోరీలు జరగకుండా ఉండేందుకు మా వంతు ప్రయత్నం చేస్తున్నాం. దొంగలపై తప్పకుండా గట్టి చర్యలు ఉంటాయి.

– రాజేంద్రప్రసాద్, డీఎస్పీ, మైదుకూరు

ఆగి ఉన్న లారీ నుంచి డీజిల్ చోరీ


ట్యాంక్ మూత తీసి డీజిల్‌ను దొంగిలించిన దృశ్యం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం కడప రోడ్డులో ఆగి ఉన్న లారీలోని డీజిల్ ట్యాంక్ నుంచి సుమారు 230 లీటర్ల డీజిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు శ్రీ లక్ష్మీ శ్రీనివాస ట్రాన్స్‌పోర్టు యజమాని కుడుముల ఆనంద్‌రెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన కథనం మేరకు ముద్దనూరు నుంచి నగరికి వెళ్లేందుకు లారీని కడప రోడ్డులోని మేడా వేబ్రిడ్జి వద్ద నిలిపి ఉంచారు. తెల్లవారుజామున లారీ వద్దకు వచ్చి చూడగా లారీ డీజిల్ ట్యాంకు తెరిచి ఉంది. ట్యాంకులోని 230 లీటర్ల డీజిల్ మాయమైంది. దీని విలువ సుమారు రూ.21 వేలు అవుతుంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీను పరిశీలించారు. గతంలో ఇలాగే చిలంకూరు వద్ద లారీలోని డీజిల్‌ను చోరీ చేశారు. పట్టణ సీఐ నరేష్‌బాబు మాట్లాడుతూ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్

ప్రొద్దుటూరు క్రైం : సబ్ డివిజన్‌లో ఉన్న పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదివారం ప్రొద్దుటూరు డీఎస్పీ కార్యాలయానికి విచ్చేశారు. డీఎస్పీ భావన ఎస్పీకి స్వాగతం పలికారు. సబ్ డివిజన్ స్థితిగతుల గురించి ఎస్పీకి వివరించారు. అనంతరం సీఐలు, ఎస్‌ఐలతో ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలను అణచి వేయాలన్నారు. వీటిని నిర్వహిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని చెప్పారు. ప్రొద్దుటూరులో పోలీసింగ్ అనేది కనిపించాలన్నారు. నామమాత్రంగా కాకుండా శాంతిభద్రతలకు ఇబ్బంది కలిగించే వారిపై కేసులు నమోదు చేస్తూ, వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. రాత్రి గస్తీ ముమ్మరం చేసి చోరీలు, ఇతర సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవ్ టీజింగ్ జరగకుండా కళాశాలల వద్ద పోలీసు మూవింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, అనవసరంగా రాత్రిళ్లు తిరిగే వారిపై నిఘా పెట్టాలన్నారు. రాత్రి సమయంలో ఎందుకు తిరుగుతున్నావంటూ వారిని ప్రశ్నించడంతో పాటు ఆయా వ్యక్తుల వివరాలను సేకరించాలని చెప్పారు. అనుమానిత, సమస్యాత్మక వ్యక్తులను బైండోవర్ చేయాలన్నారు. భూ వివాదాలు ఉంటే రెవెన్యూ అధికారులకు తెలిపి వారి ద్వారా పరిష్కారం జరిగేలా చూడాలని ఎస్పీ పేర్కొన్నారు. సీసీ కెమెరాలు నేర పరిశోధనలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఇక్కడ చాలా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పని చేయడం లేదని, దాతల ద్వారా వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐలు రామకృష్ణారెడ్డి, యుగంధర్, గోవిందరెడ్డి, దేవకిరణ్‌కుమార్, బాలమద్దిలేటి, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ దారెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు, రాఘవేంద్రారెడ్డి, సురేష్, యోగేందర్, వెంకటరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు డీఎస్పీ కార్యాలయంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

పోలీస్ స్టేషన్ల తనిఖీ


ఎర్రగుంట్లలో పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్

ఎర్రగుంట్ల/వల్లూరు(చెన్నూరు) : జిల్లాలోని ఎర్రగుంట్ల, చెన్నూరు పోలీస్ స్టేషన్‌లను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్రిమినల్, సివిల్ కేసులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. పలు కేసులపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఉందని సిబ్బందిని ఆదేశించారు. ఎర్రగుంట్ల, చెన్నూరు సీఐలు నరేష్‌బాబు, పురుషోత్తంరాజు పాల్గొన్నారు.

జానపద సాహిత్య పరిశోధన శిఖరం 'తంగిరాల'

పలు సంఘాల నేతల నివాళి

కడప సెవెన్‌రోడ్స్ : జానపద సాహిత్య పరిశోధన శిఖరం ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావు అని వివిధ సంఘాలు, పార్టీల నేతలు కొనియాడారు. రేనాటి సూర్యచంద్రుల విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన తంగిరాల సుబ్బారావు సంస్మరణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. తొలుత చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎస్.రవిశంకర్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ త్యాగం, దాతృత్వాలకు ప్రతీకలైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డిలకు సరైన గుర్తింపు, గౌరవం లభించలేదన్నారు. రాయలసీమ ప్రాంతానికి అనాదిగా సాంస్కృతిక పరంగా, సాహిత్య పరంగా అన్యాయం జరుగుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో రేనాటి పల్లెల్లో విస్తృతంగా పర్యటించి తన పరిశోధనల ద్వారా ఉయ్యాలవాడ, బుడ్డా వెంగళరెడ్డి జీవిత చరిత్రలను వెలికి తీసి పుస్తక రూపంలో అందించిన తంగిరాలను రాయలసీమ ప్రజలు స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నో త్యాగాలు చేసిన రాయలసీమ అజ్ఞాత వీరుల చరిత్రలను వెలికితీసి నేటి తరానికి అందించడమే తంగిరాల కృషికి కొనసాగింపు అవుతుందన్నారు. భూతపురి సుబ్రమణ్యశర్మ మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ వీరగాథ సాహిత్య పరిశోధనలో తంగిరాల మేటి అని, ఆయన మరణం సాహిత్య రంగానికి తీరని లోటన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ తంగిరాల మరణం రాయలసీమ జానపద సాహిత్యానికి తీరని లోటన్నారు. జానపద సాహిత్యంపై పరిశోధనకు విశ్వవిద్యాలయాల్లో తంగిరాల పునాదులు వేశారని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి తాను పంపిన సందేశంలో పేర్కొన్నారు. తెలుగుభాషా మిత్ర మండలి నాయకులు డాక్టర్ జీవీ సాయిప్రసాద్, డాక్టర్ అనుగూరు చంద్రశేఖర్‌రెడ్డిలు పంపిన తమ సందేశంలో తంగిరాల మహోన్నత సాహితీమూర్తిగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి జిల్లా కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, జానమద్ది సాహితీపీఠం అధ్యక్షుడు జానమద్ది విజయభాస్కర్, సీపీఐ నాయకులు సావంత్ సుధాకర్ రావు, మల్లికార్జునరెడ్డి, ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్వీ భాస్కర్‌రెడ్డి, రామశేఖర్ రెడ్డి, ఆర్‌ఎస్‌పీ నాయకుడు సుబ్బరాయుడు, ఏపీ దళితమిత్ర అధ్యక్షుడు కై పు రామాంజనేయులు, లోక్‌సత్తా నాయకుడు దేవరశ్రీకృష్ణ, రెవెల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేశు యాదవ్, పీఆర్‌ఎస్‌వైఎఫ్ నాయకుడు ఓరుగంటి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


తంగిరాల వెంకట సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ సంఘాలు, పార్టీల నాయకులు

ఏటీఎం కార్డు మార్చి రూ.61 వేలు డ్రా


బాధితుడు ఉత్తన్న

వేంపల్లె : వేంపల్లెలో గుర్తు తెలియని వ్యక్తి ఏటీఎం కార్డు మార్చి గండి దేవస్థానం ఉద్యోగి అకౌంట్‌లో నుంచి రూ.61వేలు డ్రా చేశాడు. బాధితుడు డేరంగుల ఉత్తన్న కథనం మేరకు.. వేంపల్లెలోని వడ్డే వీధికి చెందిన డేరంగుల ఉత్తన్న గండి దేవస్థానంలో ఉద్యోగం చేస్తున్నాడు. జనవరి 30వ తేదీన ఇతను ఏటీఎం కార్డుకు చెందిన పిన్ నెంబర్ మార్చుకోవాలని వేంపల్లెలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు వెళ్లాడు. అయితే ఏటీఎం కార్డు పిన్ నెంబర్ మార్చుకోవడం చేతకాక అక్కడే ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని సాయం అడిగాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తి తెలివిగా అతని వద్ద ఉన్న పనికి రాని కార్డు ఉత్తన్నకు ఇచ్చి వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి ఒక్కసారి రూ.2వేలు, మరో సారి రూ.9 వేలు, రూ.10వేలు, రూ.10 వేలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. మరుసటి రోజు బ్యాంకుకు వెళ్లే సమయానికి మరో రూ.30వేలు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. వరుసగా డబ్బులు డ్రా అయినట్లు మెసేజ్‌లు రావడంతో బాధితుడు కంగారు పడి బ్యాంకు అధికారుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ ఏటీఎం కార్డు మీది కాదని అధికారులు చెప్పడంతో బాధితుడు మోసపోయినట్లు తెలుసుకున్నాడు. దీంతో వెంటనే బ్యాంకు అధికారులు ఆయన అకౌంట్‌ను బ్లాక్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని ఎస్‌ఐ రంగారావు తెలిపారు.

మేధావుల మౌనం దేశానికి నష్టం

కడప ఎడ్యుకేషన్ : మేధావుల మౌనం దేశ, రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం అని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. దేశంలో, రాష్ట్రంలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్న వేళ ఆ సమస్యల పరిష్కారానికి ఒకటో, రెండో సంస్థలు పనిచేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, భావసారూప్యంగల అన్ని సంస్థలు కలిసి పనిచేసినప్పుడే సాధ్యమన్నారు. కడప నగరంలోని ఎస్టీయూ భవన్‌లో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజకీయ పార్టీలుగానీ, సామాజిక సేవా సంస్థలుగాని ఒకే మూసలో పనిచేస్తే ప్రజల్లో నిలబడలేవన్నారు. ప్రజలకు అర్థమయ్యే పద్ధతిలో, ప్రయోజనం కలిగించే విధానంలో పనిచేసినప్పుడే వారి మన్ననలు పొందుతాయని తెలిపారు. జన విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు బి. విశ్వనాథ మాట్లాడుతూ ప్రతి సంస్థ మూడో తరం నాయకత్వ లోపంతో సతమతమవుతోందన్నారు. ఈ లోపాన్ని అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకుడు కొర్రా సురేష్ బాబు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకోసం మేధావి వర్గం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గోపాల్ నాయక్ మాట్లాడుతూ మూఢనమ్మకాలు పెచ్చరిల్లుతున్న సమయంలో జన విజ్ఞాన వేదిక లాంటి సంస్థలు ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. సమావేశంలో జాతీయ ప్రచార కార్యదర్శి సనావుల్లా, మైన్స్ శాఖ ఉద్యోగి రాంబాబు, పట్టణ కార్యదర్శి శంకరయ్య, నాయకులు నాగసుబ్బారెడ్డి, వెంకటశివ, సుధాకర్, ప్రకాశ్, శేషారెడ్డి, వెంకటరమణ, గంగాధర్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి

నిందితులను పట్టుకుంటాం



బిదినంచర్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ వెంకటరమణ

సింహాద్రిపురం : వృద్ధురాలి మృతి కేసులో త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. మండలంలోని బిదినంచర్ల గ్రామానికి చెందిన వై.పార్వతమ్మ అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. మృతురాలి కుమారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పులివెందుల రూరల్ సీఐ వెంకట రమణ ఘటనా స్థలాన్ని పరిశీలించి గ్రామస్తుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన

కాగా వృద్ధురాలి మృతి కేసు దర్యాప్తులో భాగంగా డాగ్ స్క్వాడ్‌ను రప్పించగా, అది ఓ అనుమానిత వ్యక్తి ఇంటిలోకి నేరుగా వెళ్లిందని ఎస్‌ఐ తెలిపారు.అలాగే మృతదేహాన్ని తరలించేందుకు వీలు లేకపోవడంతో సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించామన్నారు.

బ్యాంకులో దొంగతనం కేసులో నిందితుల అరెస్టు


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

జమ్మలమడుగు : జమ్మలమడుగులోని కెనరా బ్యాంకులో ఐదు రోజుల క్రితం పెద్దదండ్లూరు గ్రామానికి చెందిన ఐరగంరెడ్డి సావిత్రి అనే మహిళకు సంబంధించిన బంగారాన్ని చోరీ చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. తమ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సీసీ ఫుటేజీల ఆధారంతో దొంగలను పట్టుకున్నారన్నారు. నిందితులు అనంతపురం జిల్లా మారుతినగర్, గుత్తి టౌన్‌కు చెందిన వనార్చి అనంతమ్మ, ఆమె కుమారుడు మహేష్, కోడలు గాయత్రిగా గుర్తించామన్నారు. ఆదివారం తాడిపత్రి బైపాస్ రోడ్డులో ఓమినీ కారులో పారిపోతుండగా సీఐ లింగప్ప, ఎస్‌ఐ బి.రామకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ దేవదాసు, రియాజ్, నాగేంద్ర చాకచక్యంగా వారిని పట్టుకున్నారని తెలిపారు. వారి వద్ద నుంచి 11 తులాల బంగారంతోపాటు ఓమిని కారును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు.బ్యాంకు అధికారులు బ్యాంకుల్లో దొంగతనం జరిగినప్పుడు తమకు పట్టనట్లు ఉండటంతోనే దొంగతనాలు జరుగుతున్నాయని డీఎస్పీ అభిప్రాయపడ్డారు. ఇటీవల కెనరా బ్యాంకులో అధికారులు అప్రమత్తంగా లేకపోవడంతోనే దొంగలు బ్యాంకు నుంచి వెళ్లిపోయారన్నారు. దొంగతనం జరిగినప్పుడు బ్యాంకు అధికారులు వెంటనే లోపల ఉన్న వారిని ఎవ్వరిని బయటికి పంపించకుండా సోదాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అర్బన్ సీఐ లింగప్ప పాల్గొన్నారు.

ఆంధ్ర జట్టు భారీ స్కోర్


197 పరుగులు సాధించిన ఆంధ్ర బ్యాట్స్‌మన్ వెంకట రాహుల్


107 పరుగులతో నాటౌట్‌గా ఆంధ్ర బ్యాట్స్‌మన్ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు అండర్ 23 అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు భారీ స్కోర్ సాధించింది. 360 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో బరిలోకి దిగిన ఆంధ్ర జట్టు ఆదివారం 8 వికెట్ల నష్టానికి 544 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని వెంకట రాహుల్ 197 పరుగులు, ప్రసాద్ 107 పరుగులు చేశారు. సుమిత్ 48 పరుగులు చేశారు. హిమాచల్ బౌలర్లు శర్మ 2, నారాయణ్ 2 వికెట్లు తీశారు. అనంతరం జరిగిన హిమాచల్ ప్రదేశ్ జట్టు రెండవ రోజు ఆటో ముగిసే సమయానికి 45 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. జట్టులోని యోగ్దీప్ ఠాకూర్ 50, అమన్ ప్రీత్ సింగ్ 38 పరుగులు చేశారు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు 385 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలి

కడప కల్చరల్ : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరిగి వారు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. నగరంలోని సెయింట్ జోసెఫ్ బాలుర పాఠశాలలో రెండు రోజులపాటు కడప బాలోత్సవం కార్యక్రమం ఉల్లాస భరిత వాతావరణంలో కొనసాగింది. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు బాలోత్సవం కమిటీ వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, తెలుగు కథా రచన, చిత్రలేఖనం, మట్టితో బొమ్మలు, మ్యాప్, పత్రికా పఠనం పోటీలు జూనియర్స్, సీనియర్స్, సబ్ జూనియర్స్ గా విభజించి నిర్వహించారు. విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు.

బాలోత్సవం కమిటీ అధ్యక్షుడు గోపాల్ అధ్యక్షతన ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైవీయూ వీసీ మాట్లాడుతూ విద్యార్థులు తమ గమ్యాన్ని తల్లిదండ్రుల ద్వారా నిర్ణయించుకుంటారన్నారు. విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారే తప్ప నోబెల్ ప్రైజ్ వచ్చే స్థాయిలో కష్టపడక పోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. విద్యతో పాటు ఇతర కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ముఖ్యమని ఆయన వివరించారు. డాక్టర్ జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. విద్యావేత్త గోవర్ధన్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు నాగముని రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్ మాట్లాడారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు సహ పాఠ్యాంశాల్లోనూ భాగస్వాములు కావాలన్నారు. విద్యావేత్త లయన్ ఖాసింఖాన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రచార కార్యదర్శి శివరాం, కల్చరల్ కన్వీనర్ వెంకటసుబ్బయ్య, అకడమిక్ కన్వీనర్ మహేష్, గోపి, సత్తార్ ఫైజీ, మగ్బూల్‌బాషా, దేవదత్తం, సుందరయ్య, రామకృష్ణారెడ్డి, బాలయల్లారెడ్డి, ప్రొఫెసర్ మృత్యుంజయరావు, ఉషా తులసి, అరుణ, సరస్వతి, సునీత, వెంకటేశ్వర్లు, స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.


నిర్వాహకులకు మెమెంటోలు అందజేస్తున్న విద్యావేత్త ఖాసింఖాన్

అన్నప్రాసన రోజే అనంతలోకాలకు..

మదనపల్లె : ఆరు నెలలు నిండకుండానే ఆ చిన్నారికి నూరేళ్లు నిండాయి. గుర్రంకొండ మండలం మర్రిమాకులపల్లెకు చెందిన బాలాజీ, భారతిలకు ఒకటిన్నర సంవత్సరం క్రితం వివాహమైంది. వీరికి ఐదునెలల క్రితం మొదటి కాన్పులో మగశిశువు జన్మించాడు. ఆరోనెలలో పడిన వెంటనే చిన్నారికి అన్నప్రాసన కార్యక్రమం స్థానికంగా ఉన్న ఓ ఆలయంలో ఘనంగా చేసేందుకు నిర్ణయించి ఆదివారం బంధుమిత్రులను ఆహ్వానించారు. కార్యక్రమం అనంతరం చిన్నారిని తీసుకుని ఇంటికి వస్తుండగా అస్వస్థతకు లోనయ్యాడు. వెంటనే తల్లిదండ్రులిద్దరూ చిన్నారిని వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మదనపల్లెకు రెఫర్ చేశారు. హుటాహుటిన చిన్నారిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.